మేయర్‌ను కలిసిన సంతోష్‌గుప్తా



మేయర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సంతోష్‌గుప్తా, కపిల్‌రెడ్డి

అబిడ్స్: జీహెచ్‌ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మిని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకుడు, ఆస్ట్రేలియా తెలంగాణ అసోసియేషన్ అధ్యక్షుడు కపిల్‌రెడ్డి గురువారం కలిశారు. ఈ సందర్భంగా గ్రేటర్ పరిధిలో జరుగుతున్న సర్వే వివరాలు ఆమెకు వివరించారు. అనంతరం సంతోష్‌గుప్తా మాట్లాడుతూ.. గోషామహల్ నియోజకవర్గంలో కుటుంబ సమగ్ర సర్వే జోరుగా జరుగుతుందన్నారు. ప్రతి ఇంటిని సర్వే చేసేందుకు అధికారులు ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. సర్వేతో ప్రజలకు ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు.

మాదిగలు అన్ని రంగాల్లో రాణించాలి



చార్మినార్: మాదిగలు అన్ని రంగాల్లో రాణించాలని సొసైటీ ఆఫ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ మాదిగ వ్యవస్థాపక అధ్యక్షుడు మిర్ జుమ్లా ముత్యాలు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సొసైటీ ఆఫ్ షెడ్యూల్ క్యాస్ట్ మాదిగ ఆధ్వర్యంలో ఉప్పుగూడ ధనరాజ్ ఫంక్షన్ హాల్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులను పొందుతూ అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. సొసైటీ ఆఫ్ షెడ్యూల్డ్ క్యాస్ట్ మాదిగ ప్రధాన కార్యదర్శి పార్వతి నరేష్ బాబు, కోశాధికారి వగ్గు సురంజన్, సంయుక్త కార్యదర్శి పడికంటి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సమీనాబేగం

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తలాబ్‌చంచలం కార్పొరేటర్ సమీనా బేగం అన్నారు. డివిజన్‌లోని భవానీనగర్, చాచాగ్యారేజ్, నషేమన్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు, విద్యుత్ కేబుల్ పనులు గురువారం ఆమె సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాదయాత్రలు చేపడుతూ సమస్యలను దశల వారీగా పరిష్కారిస్తున్నామన్నారు. సీసీ రోడ్డు, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. ఆమెతో పాటు మజ్లిస్ పార్టీ నషేమన్ నగర్ ఏరియా కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మహమూద్ అలీ సమీర్, నాయకులు ఖుస్రు, ఆమీర్ గౌస్, జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో కార్తీక వనభోజనాలు


వనభోజనాల్లో డీఎం వేదవతి

చాంద్రాయణగుట్ట: ఫారూఖ్‌నగర్ ఆర్టీసీ బస్సు డిపోలో గురువారం కార్తీక వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్టీసీ ఎండీ. వీసీ సజ్జనార్ ఆదేశాల మేరకు డిపో మేనేజర్ వేదవతి ఆధ్వర్యంలో డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, వారి కుటంబ సభ్యులందరూ పాల్గొని తులసి చెట్టుకు దీపారాధన చేసి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం ఉద్యోగులు ఆట పాటలతో సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు శాలిని, భారతి, యాదయ్య, ప్రవీణ్, బీమ్ నాయక్, దేవిరాణి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలి


సీపీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కౌసర్, మాజీద్ హుస్సేన్

గోల్కొండ: మెహిదీపట్నం, టోలీచౌకీ తదితర ప్రాంతాల్లో ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని మజ్లిస్ ఎమ్మెల్యేలు కౌసర్, మాజీద్ హుస్సేన్ నగర్ పోలీస్ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు గురువారం వారు సీవీ ఆనంద్‌ను కలిశారు. ఫుట్‌పాత్ ఆక్రమణల వల్ల ప్రతి నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. మెహిదీపట్నం, నానల్‌నగర్, టోలీచౌకీ, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లో నిత్యం ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని వారు కమిషనర్‌కు వివరించారు. ట్రాఫిక్ పోలీసులు తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా ఉంటున్నాయని, బల్దియా వారితో కలిసి రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను తొలగించి సరైన చర్యలు తీసుకోవాలని కోరారు. అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యేలు తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన


సమావేశంలో బీజేపీ శక్తిమోర్చా ఇన్‌చార్జీలు

లంగర్‌హౌస్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి అన్ని వర్గాల నుంచి విశేష స్పందన వస్తుందని బీజేపీ కార్వాన్ నియోజకవర్గ ఇన్‌చార్జి అమర్‌సింగ్ అన్నారు. గురువారం గుడిమల్కాపూర్‌లో ఝాన్సీ హాల్‌లో బీజేపీ శక్తిమోర్చా ఇన్‌చార్జీలు, వివిధ మోర్చాల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి బీజేపీ సభ్యత్వం తీసుకున్నారన్నారు. ప్రధాని మోదీ పాలన దక్షతకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిజ్వర్‌సింగ్, శ్రీకాంత్ సాగర్, సునీల్ యాదవ్ తదితరులు ఉన్నారు.

మహాత్మా జ్యోతిరావు పూలేకు ఘన నివాళి


నిజాం కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రొఫెసర్ రాజశేఖర్ తదితరులు

చాంద్రాయణగుట్ట: దళితులు, గిరిజనులు, మహిళల అభ్యున్నతికి ఉద్యమించిన ఘనత పూలేకే దక్కుతుందని సీపీఎం చాంద్రాయణగుట్ట జోన్ కార్యదర్శి ఎస్.కిషన్ కొనియాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా సీపీఎం ఆధ్వర్యంలో జంగమ్మెట్‌లో గురువారం ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. నేటి తరం యువత పూలేను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్య ఆవశ్యకతను వివరించిన గొప్ప వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కృష్ణా నాయక్, సోమన్న, వీరన్న, రంగస్వామి, చిన్న, మహేష్ పాల్గొన్నారు.

గాంధీభవన్‌లో..

గన్‌ఫౌండ్రీ: జ్యోతిరావు పూలే వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి గాంధీభవన్‌లో ఏఐసీసీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్, తిలక్ సింగ్, రణవీర్ సింగ్, రమేష్‌లు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నిజాం కళాశాలలో..

గన్‌ఫౌండ్రీ: సామాజిక న్యాయంతో పాటు అట్టడుగు వర్గాల సంక్షేమం, అభివృద్ధి, రాజ్యాధికారం కోసం మహాత్మా జ్యోతిరావు పూలే చూపిన మార్గం నేటికీ అనుసరణీయమని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ.రాజశేఖర్ అన్నారు. గురువారం నిజాం కళాశాలలో కళాశాల బీసీ సెల్ ఆధ్వర్యంలో పూలే వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నిజాం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఉపేందర్ రెడ్డి, బీసీ సెల్ కో ఆర్డినేటర్ సీహెచ్.వెంకటేశ్వర్లు, పీఆర్‌ఓ కవితా షిండే పాల్గొన్నారు


పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


నివాళులర్పిస్తున్న ఏఐసీసీ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్

నేడు చార్మినార్ నుంచి తెలంగాణ భవన్ వరకు ర్యాలీ


కేటీఆర్‌ను కలిసిన మహ్మద్ సలావుద్దీన్ లోధీ

చార్మినార్: కేసీఆర్ దీక్షా దివస్‌తో తెచ్చిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి ఏడాది కాకుండానే పలు ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడుతోందని చార్మినార్ శాసన సభ నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. దీక్షా దివస్‌ను గుర్తు చేసుకుంటూ ఈ నెల 29న నిర్వహించనున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి గురువారం ఆయన కేటీఆర్‌ను కలిసి చర్చించారు. ఈ సందర్భంగా మహ్మద్ సలావుద్దీన్ లోధీ మాట్లాడుతూ.. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు పురానీహవేలీలోని చార్మినార్ పార్టీ కార్యాలయం నుంచి నాయకులు, కార్యకర్తలతో కలిసి బసవతారకం కేన్సర్ ఆసుపత్రి వరకు ర్యాలీ నిర్వహించనున్నామన్నారు. అక్కడ నుంచి కేటీఆర్‌తో కలిసి తెలంగాణ భవన్‌కు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

వాటర్‌బోర్డులో ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలి


పోల్కం శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: వాటర్‌బోర్డులో ఏఎంఎస్ (అన్యువల్ మెయింటెనెన్స్ సిస్టమ్) టెండర్ల విధానాన్ని వెంటనే రద్దు చేయనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి, వాటర్‌బోర్డు కాంట్రాక్టర్స్ జేఏసీ మీడియా ఇన్‌చార్జి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశ పెట్టిన ఏఎంఎస్ విధానం అవినీతి నిలయంగా మారిందన్నారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..బీఆర్‌ఎస్ హయాంలో మాజీ మంత్రి హరీష్‌రావు దగ్గర పీఎస్‌గా పనిచేసిన అశోక్‌రెడ్డిని వాటర్‌బోర్డు ఎండీగా నియమించడంతో ఆయన బీఆర్‌ఎస్ విధానాలను అమలు చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ పాలసీని ఇంకా కొనసాగించడం దారుణమన్నారు. ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయాలని వాటర్‌బోర్డు ఎండీకి పలువురు మంత్రులు, కాంగ్రెస్ అగ్రనాయకులు ఎన్ని సార్లు విన్నవించినా ఆయన ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ఏఎంఎస్ విధానాన్ని రద్దు చేయనిచో ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ముందు ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని పోల్కం శ్రీనివాస్ హెచ్చరించారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీఎస్.రాములు తదితరులు

పుస్తకావిష్కరణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, సాహిత్య అకాడమి సౌజన్యంతో బహుళ త్రైమాసిక మహిళా పత్రిక సంయుక్త ఆధ్వర్యంలో రచయిత్రి నాంపల్లి సుజాత రచించిన 'కుదురు', 'బహుళ'3వ వార్షిక పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బీఎస్.రాములు మాట్లాడుతూ..వివిధ అంశాలపై రూపొందించిన పుస్తకాన్ని, పత్రికను ఒకే వేదికపై ఆవిష్కరించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని పుస్తకాలు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఎన్.బాలాచారి, అరుణోదయ సాంస్కృతిక సంస్థ అధ్యక్షురాలు విమలక్క, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం, హైదారబాద్ బుక్ ఫేయిర్ చైర్మన్ యాకూబ్, రచయిత్రి తిరునగరి దేవకీదేవి, గోగు శ్యామల, కొండవీటి సత్యవతి, గీతాంజలి, సీహెచ్. ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ధన్వంతరీ హోమం

చాంద్రాయణగుట్ట: రాజన్నబావి ప్రాంతంలోని తుల్జా భవానీ ఆలయంలో భవానీ సేవా సంఘం ఆధ్వర్యంలో గురువారం ధన్వంతరీ హోమం నిర్వహించారు. లోక కల్యాణం, ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని కాంక్షిస్తూ ఈ హోమాన్ని నిర్వహించడం జరిగిందని సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రంగాచార్య కులకర్ణి తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి జాహ్నవి, సలహాదారులు పేరోజీ మహేశ్వర్, ఆలయ కమిటీ సభ్యులు బలరాజు రెడ్డి, వీరేష్, లింగం, చంద్రమూర్తి, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో భక్తులు

నేటి నుంచి అధ్యయన బ్రహ్మోత్సవాలు

సంతోష్‌నగర్: న్యూ సంతోష్‌నగర్ కాలనీలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం, అభయాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 29 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు 36వ అధ్యయన బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ అధ్యయన బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

అభినందనలు


శివానిని అభినందిస్తున్న కోచ్ ఆయూష్ యాదవ్

గన్‌ఫౌండ్రీ: గుజరాత్‌లో జరుగుతున్న 68వ ఎస్‌జీఎఫ్‌ఐ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో నగరానికి చెందిన క్రీడాకారిణి శివాని కర్ర సత్తా చాటింది. అండర్ 14 (200) మీటర్ల విభాగంలో బంగారు పతకాన్ని సాధించి అత్యుత్తమ ప్రతిభను కనబరిచింది. అదేవిధంగా 100 మీటర్ల విభాగంలో సిల్వర్ మెడల్‌ను సాధించింది. ఈ సందర్భంగా కోచ్ ఆయూష్ యాదవ్ ఆమెను అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పూజలు


త్రయంబకేశ్వర ఆలయంలో..

అబిడ్స్: గుడిమల్కాపూర్ త్రయంబకేశ్వర శివాలయంలో గురువారం కార్తీకమాసం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయానికి క్యూ కట్టారు. భక్తులు దీపాలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

అబిడ్స్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఇమ్మానుయేల్



అబిడ్స్: అబిడ్స్ పోలీస్‌స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా ఎస్‌ఏ ఇమ్మానుయేల్‌ను నియమిస్తూ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. సంవత్సర కాలం గడవక ముందే ఎన్నికల ముందు అబిడ్స్ ఇన్‌స్పెక్టర్‌గా వచ్చిన రాజగోపాల్‌రెడ్డిని బదిలీ చేయడంతో చర్చానీయాంశంగా మారింది. కొత్త ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇమ్మానుయేల్ గతంలో గోషామహల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, నారాయణగూడ పోలీస్‌స్టేషన్, ఆసిఫ్‌నగర్‌తో పాటు ఇటీవలే సుల్తాన్‌బజార్‌లో కొద్ది రోజుల పాటు క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. అబిడ్స్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్‌రెడ్డిని సుల్తాన్‌బజార్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్‌గా, సుల్తాన్‌బజార్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌ఏ. ఇమ్మానుయేల్‌ను అబిడ్స్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఇమానుయేల్ మాట్లాడుతూ..శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తానన్నారు.

మహిళల కోసం సేవా కేంద్రాలు ఏర్పాటు చేస్తాం


మాట్లాడుతున్న మహ్మద్ నజీబ్

గోల్కొండ: మహిళల సమస్యలు పరిష్కరించడం, వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇవ్వడానికి ప్రత్యేక సేవా కేంద్రాలు ప్రతి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తామని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. గురువారం టోలీచౌకిలోని తన కార్యాలయంలో ఆయన ఆసిఫ్‌నగర్, అహ్మద్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన పలువురు మహిళలతో మాట్లాడారు. ఈ కేంద్రాలలో కుటుంబ సమస్యల పరిష్కారం, దంపతుల మధ్య కలహాలు పరిష్కరించడంతో పాటు మహిళల సాధికారత కోసం సలహాలు, సూచనలు ఉచితంగా ఇస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ఆయేషా బేగం ఆధ్వర్యంలో ప్రతి కేంద్రానికి ఒక మహిళను, మహిళల కమిటీని ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లాలలో ఈపాటికే ఈ కేంద్రాలు పనిచేస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సమీనా, సల్మా, మసూద్ తదితరులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, కార్పొరేటర్ వసీవుద్దీన్

యాకుత్‌పురా: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ సూచించారు. ప్రజారోగ్య శాఖ యాకుత్‌పురా-2 యూపీహెచ్‌సీ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం చున్నేకిబట్టిలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో స్థానిక ప్రాంతాలకు చెందిన 150 పాల్గొన్ని వైద్య చికిత్సలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రజలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ వైద్య శిబిరంలో రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీవుద్దీన్, యాకుత్‌పురా యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ ఫర్హనాజ్, వైద్యులు డాక్టర్ షఫిక్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా చార్మినార్ సీబీడీ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. ఏజీ కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని సంజీవని హిల్స్, నలంద నగర్, సిరిమల్లే నగర్, ఏజీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే జనప్రియ ఏబీసీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని కేశవనగర్, కృష్ణానగర్, శివనగర్, మోర్ సూపర్ మార్కెట్, గుమ్మకొండ కాలనీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలో..

లంగర్‌హౌస్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మెహిదీపట్నం విద్యుత్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

- 11 కేవీ ఉషోదయ కాలనీ, శారదా నగర్ ఫీడర్ల పరిధిలోని బాలాజీ నగర్, సత్యనారాయణ నగర్, మందుల గూడ, ఉషోదయ కాలనీ, ప్రియ కాలనీ, వీబీజీ గార్డెన్, ఫ్లవర్ మార్కెట్, గుడిమల్కాపూర్, శివబాగ్, జయనగర్, శారద నగర్, గుడిమల్కాపూర్ కబడ్డీ స్టేడియం, మహావీర్‌నగర్, మార్కండేయనగర్, ఎల్‌ఐసీ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే 11 కేవీ అన్వర్ ఉలుం కళాశాల ఫీడర్ పరిధిలోని బడామసీద్, ప్రియ థియేటర్, మల్లేపల్లి చౌరస్తా, భరత్ గ్రౌండ్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామన్నారు.

'కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం దివాలా'


కేటీఆర్‌తో జీవన్‌సింగ్ తదితరులు

గోల్కొండ: కాంగ్రెస్ ప్రభుత్వం తన ఒక్క సంవత్సరం పాలనలో రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాలా తీయించిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గురువారం కార్వాన్ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీఆర్‌ఎస్ పార్టీని వీడిన వారు మళ్లీ సొంతగూటికే చేరుతున్నారన్నారు. వారందరికీ తాము ఆహ్వానం పలుకుతున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పెద్దలను ప్రసన్నం చేసుకోవడానికి మూసీ ప్రక్షాళనతో పాటు హైడ్రాను అమల్లోకి తెచ్చారని ఆయన ఆరోపించారు. తమ సిద్ధాంతాలకు తాము ఎప్పుడూ కట్టుబడి ఉంటామని, ప్రజా సంక్షేమమే తమ అంతిమ లక్ష్యమన్నారు. ఆయనను కలిసిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు టి.జీవన్‌సింగ్, కనకరాజు, కార్వాన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ ముత్యాల భాస్కర్, రంగారెడ్డి తదితరులు ఉన్నారు.

వాటర్ ఫిల్టర్ అందజేత

జియాగూడ: కొన్నేళ్లుగా కలుషిత నీటి సమస్యను ఎదుర్కొంటున్న వికారాబాద్ జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని సుమారు 400 మంది విద్యార్థులకు నగరానికి చెందిన స్ట్రీట్‌కాజ్ వీజేఐటీ ఎన్జీఓ సంస్థ బాసటగా నిలిచింది. ఆ స్కూల్లో కలుషిత నీటి కీలక సమస్యను పరిష్కరించడంలో భాగంగా స్ట్రీట్‌కాజ్ వీజేఐటీ విద్యార్థులు నిధులు సేకరించి స్కూల్‌కు నీటి ఫిల్టర్ అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో స్ట్రీట్ కాజ్ వీజేఐటీ డివిజనల్ ప్రెసిడెంట్ నేహాల్, అసోసియేట్ ప్రెసిడెంట్ పూజిత, ఇతర ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యులు వీక్షణ, విష్ణు, సోఫియా, అన్విత్, అబ్దుల్లా, భూమిక తదితరులు పాల్గొన్నారు.


వాటర్ ఫిల్టర్‌ను అందజేస్తున్న స్ట్రీట్‌కాజ్ వీజేఐటీ విద్యార్థులు

డిసెంబర్ 3న చిత్రకళా ప్రదర్శన

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, పీకాసో ద స్కూల్ ద స్కూల్ ఆఫ్ ఆర్ట్‌ల సంయుక్తాధ్వర్యంలో డిసెంబర్ 3న రవీంద్రభారతిలో చిత్రకళా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు పాఠశాల వ్యవస్థాపకుడు బైరు రమేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం చిత్రకళ ప్రదర్శన వాల్ పోస్టర్‌ను ఆచార్య వెల్దండ నిత్యానందరావు ఆవిష్కరించారు. మారిషెస్‌కు చెందిన ఉమామహేశ్వరీ దీపా బహదూర్ వేసినటువంటి చిత్రాలు ఈ ప్రదర్శనలో ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చిత్రకారులు పి.మహేస్, ఉమామహేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆచార్య నిత్యానంద రావు తదితరులు


ఈడీ వెంకటేష్‌తో సమావేశమైన చైర్మన్ మెట్టు సాయికుమార్

మత్స్యకారుల అభివృద్ధికి సహకారం అందించాలి

అఫ్జల్‌గంజ్: నేషనల్ ఫిషరీష్ డెవలప్‌మెంట్ బోర్డు ఈడీ వెంకటేష్‌తో తెలంగాణ రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ మెట్టు సాయికుమార్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ..తెలంగాణ మ త్స్యకారుల అభివృద్ధికి పూర్తి సహాయ సహ కారాలు అందించాలన్నారు. మత్స్యకార అభివృద్ధికి, మత్స్యకార సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రత్యేక కృషి చేస్తుందన్నారు.